# ప్రజాశక్తి

శనివారం 12 ఏప్రిల్ 2025 | 5 | అనంతపురం




## దార్శనికుడు జ్యోతీరావు పూలే

### జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు



పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి పయ్యావుల, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

వందేళ్ల కిందటే బడుగుల హక్కులతో పాటు స్త్రీ సమానత్వానికి బాటలు వేసిన దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ ఆవరణంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ పూలే అసామాన్యుడిగా జన్మించినా సామాజిక విప్లవానికి నాంది పలికిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆనాటి పరిస్థితుల్లో వర్ణ వివక్ష, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సాగించారన్నారు. బాల్య వివాహాలు, వితంతు వివాహాలు లాంటి సామాజిక రుగ్మతలపై చైతన్యం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవనాయుడు, జిల్లా పరిషత్ సీఈవో రామచంద్ర రెడ్డి, బీసీ వెల్ఫేర్ డిడి ఖుష్బు కొఠారి తదితరులు పాల్గొన్నారు.

# వీడని అకాల వర్షం..!



కళ్యాణదుర్గం మండలంలో నేలకొరిగిన బొప్పాయి పంట

## పలు మండలాల్లో పంటనష్టం

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

మండు వేసవిలో పడుతున్న వర్షాలు పంటలకు తీరని నష్టాన్ని చేకూరుస్తున్నాయి. గాలులతో కూడి వర్షం వస్తుండటంతో ఉద్యావన పంటలతోపాటు, సాధారణ పంటలు కూడా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అనంతపురం జిల్లాలో గురువారం రాత్రి పలుచోట్ల మోస్తరు వర్షపాతం నమోదయింది. జిల్లా వ్యాప్తంగా 5.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా ఆత్మకూరు మండలంలో అత్యధికంగా 35.4 మిల్లీమీటర్లు పడింది. బొమ్మనహాల్‌లో 30, గుమ్మగట్ల 28.8, బ్రహ్మసముద్రం 15, శెట్టూరు మండలంలో 14.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఇంకా అనేక చోట్ల చిరు జల్లులు పడ్డాయి. వర్షపాతం కంటే ఈదురు గాలులకు ఎక్కువ నష్టం సంభవించింది. ఉద్యావన, వ్యవసాయ పంటలు అత్యధిక స్థాయిలోనే దెబ్బతిన్నాయి.

**2807 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు**



పంట పొలాలను పరిశీలిస్తున్న విప్ కాలవ

అనంతపురం జిల్లాలో గురువారం రాత్రి సంభవించిన గాలీవానకు 2807 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 14 మండలాల్లో 51 గ్రామాల్లో పంటనష్టం సంభవించినట్టు వ్యవసాయా ధికారులు అంచనా వేశారు. 1628 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతింది. 946 ఎకరాల్లో వరి పంట దెబ్బతినగా, 232 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతినింది. రాయదుర్గం నియోజకవర్గంలో అత్యధికంగా పంటలు దెబ్బతిన్నాయి. రూ.8.82 కోట్ల వరకు పంటనష్టం జరిగి ఉండవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. రాయదుర్గంలో పంట నష్టాన్ని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని భరోసానిచ్చారు. వ్యవసాయ పంటలే కాకుండా ఉద్యానవన పంటలకు నష్టం సంభవించింది. ఈ నష్టం అంచనాలను ఆ శాఖ అధికారులు వేసే పనిలోనున్నారు. మార్చి నెలలోనూ ఇదే రకంగా గాలి వానకు పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు ఏప్రిల్‌లోనూ ఇదే రకమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి.

**ఏప్రిల్‌లో అత్యధికం**

ఏప్రిల్ మాసంలో గతంలో ఎన్నడూలేనంతగా ఎక్కువ వర్షపాతం నమోదయింది. సాధారణ వర్షపాతం 2.2 మిల్లీమీటర్లు కాగా ఇప్పుడు ఈనెలలో ఇప్పటి వరకు పడిన వర్షపాతం 26.5 మిల్లీమీటర్లు ఉంది. సాధారణం కంటే 1108 శాతం అధికంగా వర్షపాతం నమోదవడం గమనార్హం. ఈ సీజన్ మొత్తంగా చూసినప్పుడు అంటే 2024 జూన్ నుంచి 205 ఏప్రిల్ వరకు చూసినప్పుడు సాధారణ వర్షపాతం 465.9 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 630.1మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 35 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది.

## రాబోవు ఐదు రోజుల్లో వర్షాలు

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

అనంతపురం జిల్లాలో రాబోవు ఐదు రోజుల్లో చిరుజల్లులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని రేకులకుంట వ్యవసాయ క్షేత్రం అధికారులు తెలియజేశారు. గరిష్ట ఉష్ణోగ్రత 38.7-39.5 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత 24.9-25.2 డిగ్రీల సెల్సియస్ నమోదు అవుతాయన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 8 -12 కిమీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. వర్షం వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో పంటల సాగు చేసిన రైతులు రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.



సిఎం చంద్రబాబుకు పెళ్లి శుభలేక అందజేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

## ఎమ్మెల్యే కుమార్తె వివాహానికి సిఎం చంద్రబాబుకు ఆహ్వానం

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, రమాదేవి దంపతులు శుక్రవారం విజయవాడలో సిఎం చంద్రబాబు ఇంటికి వెళ్లి వారి కుమార్తె వివాహానికి ఆహ్వానించారు. ఎమ్మెల్యే దంపతులతో పాటు వారి కుమారుడు అమిలినేని యశ్వంత్, వియ్యంకులు ముత్తినేని రాజగోపాల్, రాధమాధవి దంపతులతో కలిసి సిఎం చంద్రబాబు, వారి సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్‌లను కలిసి పెళ్లిపత్రిక అందజేశారు. వారి కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని వారు కోరారు.

## సామాజిక సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- పరిష్కారంపై పాలకులు, ప్రభుత్వాలు దృష్టి సారించాలి
- సామాజిక చైతన్య యాత్రలో ఐద్వా, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు
- 'అనంత'లో ప్రారంభమైన సామాజిక యాత్ర



సామాజిక చైతన్యయాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ ప్రజా సంఘాల నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

సామాజిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉందని ఐద్వా, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు విమర్శించారు. సామాజిక సమస్యల పరిష్కారం కోరుతూ ఈ సంఘాల ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో చేపట్టిన సామాజిక చైతన్య యాత్ర శుక్రవారం ప్రారంభం అయ్యింది. అనంతపురం జెడ్పీ కార్యాలయం ఆవరణంలో ఉన్న జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి యాత్రను ఐద్వా నాయకురాలు డాక్టర్ ప్రసూన జెండాఊపి ప్రారంభించారు. మొదటి రోజు బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, తాడిపత్రి, యాడికి మండలాల్లో యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ పాల్గొన్నారు. యాత్ర ప్రారంభం సందర్భంగా డా॥ప్రసూన మాట్లాడుతూ సామాజిక యాత్ర బృందం ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుంటుందన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ జనాభాలో అత్యధిక శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలు ఉన్నారని చెప్పారు. వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికీ అనేక దళితవాడల్లో కనీస సదుపాయాలకు నోచుకోవడం లేదని చెప్పారు. చనిపోతే ఖననం చేయడానికి శ్మశానవాటికల్లేని దుస్థితి ఉందన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ సమాజంలో సగభాగం



చైతన్యయాత్రలో భాగంగా నార్పలలో హాస్టల్‌ను పరిశీలిస్తున్న నాయకులు

మహిళలున్నారన్నారు. వీరి అక్షరాస్యతకు ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహం ఇవ్వకపోవడం విచారకరం అన్నారు. మహిళలు గృహ హింసకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం నియంత్రిస్తామని చెప్పి విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తోందన్నారు. భూమిలేని నిరుపేదలకు మూడు ఎకరాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక విద్య, వైద్యంను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజుల పాటు జరిగే సామాజిక యాత్రలో ఆయా ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, ఐద్వా నాయకులు చంద్రకళ, రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు

## కొనసాగిన 'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమ్మె

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

పట్టణంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పంప్ హౌస్ వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె ఆరవ రోజూ కొనసాగింది. వారికి శుక్రవారం సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని పలుమార్లు కాంట్రాక్టర్, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కార్మికులు సమ్మె బాట పట్టాల్సి వచ్చిందన్నారు. కార్మికులకు సక్రమంగా వేతనాలు చెల్లించకపోగా సమ్మె కాలపు రోజుల్లో వేతనాలు కట్ చేస్తామని, విధుల నుంచి తొలగిస్తానని బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. కార్మికులకు వేతనాలు, పిఎఫ్ చెల్లించేంత వరకూ సమ్మెను కొనసాగిస్తామని భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు భవిత్, శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ నాయకులు నరేష్, నరసింహా, రామదాసు, హనుమంతరెడ్డి, తిప్పేస్వామి, ప్రసాద్, మర్రిస్వామి, వెంకటేషులు, రామంజి, తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులకు తెగిన విద్యుత్ తీగలు

### నీటి సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి-రాయదుర్గం**

ఈదురుగాలుల ధాటికి మండలంలోని వీరాపురం గ్రామంలో పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పట్టణానికి తాగునీరందించే రక్షిత నీటి పథకం పంపింగ్‌కు అంతరాయం ఏర్పడిందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాలు శిల్ప తెలిపారు. మరమ్మతులు చేసి శనివారం ఉదయం నీరు సరఫరా చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు. పట్టణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా అదనంగా రెండు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలుల ధాటికి మండలంలోని వీరాపురం నుంచి కణేకల్లు క్రాస్ వరకూ తెగిపడిన విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లను శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప, అసిస్టెంట్ ఇంజినీర్ నరసింహులు, విద్యుత్ అధికారులు పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం లోపు మరమ్మతులు చేసి శనివారం ఉదయం పట్టణ ప్రజలకు నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఛైర్‌పర్సన్ మున్సిపల్, విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట పోరాలు శివ, సచివాలయ కార్యదర్శి కోదండ రాముడు ఉన్నారు.

## మాతాశిశు మరణాలను నివారిద్దాం

### డిఎంహెచ్ఒ ఇబి దేవి




సమావేశంలో మాట్లాడుతున్న ఈబీ.దేవి

**ప్రజాశక్తి-అనంతపురం**

మాతాశిశు మరణాలను నివారించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఇబి దేవి సూచించారు. గతనెలలో జరిగిన మాతాశిశు మరణాలపై శుక్రవారం నగరంలోని కార్యాలయంలో జిల్లాలోని వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ గతనెలలో 15 శిశు, ఒక మాతా మరణాలు సంభవించాయన్నారు. మాతాశిశుమరణాలను నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గతంలో జరిగిన మరణాలకు కారణాలను తెలుసుకుని మున్ముందు అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్, శ్రీనివాసులు, అరుణలత, బాబ్‌జాన్, ఎంపిహెచ్ఇఒ లక్ష్మన్న, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

### జిల్లా మలేరియా అధికారి ఓబులు

**ప్రజాశక్తి-అనంతపురం**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే వ్యాధులు దూరం అవుతాయని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని మరువకొమ్మ కాలనీలో చేపట్టిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఇంటి పరిసరాలు, మంచినీరు నిల్వ చేసే డ్రమ్ములు, నీటితొట్టెలు, పూలకుండీలు, డ్రెయిజీలను తనిఖీ చేసి శుభ్రం చేయించారు. అనంతరం లార్వాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా చేసి దోమల పెరుగుదలను అరికట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఫైలేరియాతో ఇబ్బంది పడుతున్న ఆయేషా అనే మహిళకు మార్బిడిటీ మేనేజ్మెంట్, డిఫార్మటీ ప్రివెన్షన్ కిట్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, అర్బన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి అబ్దుల్ మునాఫ్, మద్దయ్య, మలేరియా సూపర్‌వైజర్ శ్రీధర్ మూర్తి, వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శి కల్పన, ఆశా కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు.




షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

## అనంతలో జోయాలుక్కాస్ గ్రాండ్ న్యూ సెకండ్ షోరూమ్ ప్రారంభం

**ప్రజాశక్తి-అనంతపురం**

ప్రపంచంలోని అభి మాన నగల వ్యాపారి జోయాలుక్కాస్ అనంతపురంలో ఏర్పాటు చేసిన గ్రాండ్ కొత్త సెకండ్ షోరూమ్‌ను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, జోయాలుక్కాస్ గ్రూప్ సిఎండి జాయ్‌లుకాస్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు నచ్చి మెచ్చేరీతిలో జాయ్‌లుకాస్ బంగారు ఆభరణాలను తయారు చేస్తోందని తెలిపారు. డైమండ్ల నుంచి వెండి వరకు వేలాది మోడల్స్ అందుబాటులో తీసుకురావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎన్నారై కళాశాల కరస్పాండెంట్ మనీషా నాయర్, జోయలుక్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆంటోని జోస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ థామస్, జోయాలుక్కాస్‌తో పాటు, సిబ్బంది కస్టమర్లు హెన్రీ జోయాలుక్కాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

**ప్రజాశక్తి-రాయదుర్గం**

అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల నుంచి వినాయక కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ టి.విజయలక్ష్మి అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ర్యాలీలో ఎన్ఎస్ఎస్ కార్యనిర్వహణ అధికారులు ఎర్రన్న, అక్కులరెడ్డి, అధ్యాపకులు వీరేష్, ఆదిల్ బాషా, గంగాధర్, నరసింహులు, వెంకటేశులు, రూపవతి, అరుణమ్మ , విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల కార్మికులు లేని జిల్లాగా మారుద్దాం : కలెక్టర్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**




అనంతపురం జిల్లాను బాల కార్మికులు లేని ఆదర్శవంతమైన జిల్లాగా మార్చాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మతో కలిసి అసంఘటిత రంగ కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయడం, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం, బాల కార్మికుల నిషేధం తదితర వాటిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా జిల్లాలో ఉన్న అర్హత కలిగిన అసంఘటిత రంగ కార్మికులను లబ్ధిదారులుగా నమోదు చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రయోజనాలను వారికి అందించేందుకు వీలుంటుందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ వర్కర్లు, స్వయం సహాయక బందాల లబ్ధిదారులు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు, ఆశా, అంగన్వాడీ వర్కర్లను ఈ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. బాల కార్మికులు జిల్లాలో ఎవరూ లేకుండా చూడాలన్నారు. ప్రతి బాల కార్మికునికీ సంపూర్ణమైన పునరావాసాన్ని కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ జి.లక్ష్మీనర్సయ్య, అనంతపురం సహాయ కార్మిక అధికారులు రాధా రమాదేవి, సుజాత తాడిపత్రి సహాయ కార్మిక అధికారి ప్రతాప్ నాయుడు, జెడ్పీ సీఈవో రామచంద్రా రెడ్డి, డిఎంహెచ్ఒ డా॥ఈబీ.దేవి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డీఈఓ ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

**ప్రజాశక్తి-రాయదుర్గం**

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యమని టిబి యూనిట్ వైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని టిబి యూనిట్‌లో శుక్రవారం డాక్టర్ రమేష్ క్షయ వ్యాధి సంక్రమణ పరీక్ష, చర్మ పరీక్షలను ప్రారంభించారు. ఆయా పరీక్షల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమములో ల్యాబ్ టెక్నీషియన్ సురేష్ బాబు, హెల్త్ విజిటర్ శశికళావతి, సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ షాపుల్లో అవకతవకలపై ఫిర్యాదు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

కంబదూరు మండలంలోని రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలను అరికట్టాలని కోరుతూ శుక్రవారం వైసిపి ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ నరసింహకు వినతి పత్రం అందజేశారు. కంబదూరు మండల వైసిపి బూత్ కన్వీనర్ రాళ్ల అనంతపురం భీమేష్ మాట్లాడుతూ కొన్నిచోట్ల కార్డుదారులతో వేలిముద్ర వేయించుని వచ్చే నెల కోటాలో సరుకులు ఇస్తామని డీలర్లు మోసం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాంటి వారిపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిచో కార్డుదారులతో కలిసి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిం చారు. ఫిర్యాదు చేసిన వారిలో వడ్డే వెంకటప్ప, మండల కన్వీనర్ కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, ఒంటారెడ్డిపల్లి హనుమంతరాయుడు, వెంకటేశులు, జల్లిపల్లి రామకృష్ణ, ఉన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వైద్య చికిత్స కోసం బాధిత సహాయార్థం మంజూరైన చెక్కులను అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ చేతుల మీదుగా పంపిణి చేశారు. శుక్రవారం ఎంపి కార్యాలయంలో గుమ్మగట్ట మండలం, తాళ్లకేర గ్రామానికి చెందిన పి.సరస్వతికి రూ. 81 వేలు ఆర్థిక సహాయాన్ని చెక్కు ద్వారా ఎంపి అందజేశారు.

## రుణాల రెన్యువల్‌లో పాత పద్ధతినే అవలంభించాలి

**గార్లదిన్నె:** రుణాల రెన్యూవల్ విషయంలో బ్యాంకు ప్రతినిధులు పాత పద్ధతినే అవలంభించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో ఉన్న కెనరా బ్యాంకు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు కార్పొరేట్ వ్యవస్థల కోసం కాకుండా రైతుల కోసం పని చేయాలని సూచించారు. రైతుల హక్కులను హరించి కార్పొరేట్ వ్యవసాయ విధానాలు అవలంభించడం వల్ల రైతు మనుగడ కోసం పోరాటం చేయాల్సి వస్తోందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రుణాల రెన్యూవల్ విషయంలో పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# సహకార సంఘాలను మరింత పటిష్టం చేయాలి : కలెక్టర్

**ప్రజాశక్తి-అనంతపురం**

జిల్లాలోని సహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. 108 ప్రాథమిక సహకార సంఘాల కంప్యూటీకరణ పూర్తి చేసుకుని రాష్ట్రంలో 2వ స్థానంలో జిల్లాను నిలిపినందుకు శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, జిల్లా సహకార శాఖ అధికారిణి అరుణకుమారి, సహకార బ్యాంకు సిఇఒ సురేఖారాణి కలెక్టర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విజన్ డాక్యుమెంట్‌లో సూచించిన విధంగా 'సహకార ద్వారా సమృద్ధి' స్ఫూర్తిగా సహకార సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కంప్యూటరీకరించిన వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో మాన్యువల్ విధానంలో లావాదేవీలు నిర్వహించరాదన్నారు. కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌సిఒ ప్రభాకర్‌రెడ్డి, డి పిఎంఒ తేజస్విని, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


కలెక్టర్, జెసిని సన్మానిస్తున్న దృశ్యం

# ఒత్తిడిని అధిగమించడానికి యోగా అవసరం : ఎస్పీ

**ప్రజాశక్తి-అనంతపురం క్రైం**

విధుల్లో నిత్యం బిజీగా ఉండే పోలీసు సిబ్బందికి యోగా చాలా అవసరమని ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి సూచించారు. ఇందులో భాగంగా పోలీసు సిబ్బందిని ఒత్తిడి నుంచి తప్పించేందుకు ఎస్పీ ప్రణాళికాబద్ధంగా యోగా సాధన చేయిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్టాఫ్ పరేడ్ డే సందర్భంగా ఎస్పీ ఆదేశాలతో పోలీస్ పరేడ్ మైదానంలో సిబ్బందితో యోగా చేయించారు. ఏ.ఆర్ అదనపు ఎస్పీ, డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో యోగాసనాలు చేయించారు. ఈసందర్భంగా ఏఆర్ అదనపు ఎస్పీ, డీఎస్పీ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, విలువల్లో యోగా అత్యంత విలువైందన్నారు. అంతేగాకుండా పూర్వీకులు నుంచి వచ్చిన గొప్ప సంపద అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మనకు ఎదురవుతున్న సవాళ్లు, జీవన విధానం నేపథ్యంలో యోగా సాధన కీలకంగా మారిందన్నారు. ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం కల్గిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఎఆర్ స్పెషల్ పార్టీ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సీతారాముల కళ్యాణోత్సవం

**ప్రజాశక్తి-శింగనమల**

మండల కేంద్రంలోని ఆత్మా రామాలయం ముందున్న కళ్యాణ మండపంలో సీతారాముల కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా సాగింది. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తల్లిదండ్రులు, సీనియర్ నాయకులు, బండారు లీలావతి, బండారు రవికుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కళ్యాణోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం స్వామివారి కళ్యాణం నిర్వహించినట్లు తెలిపారు. అంతేగాకుండా నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, పచ్చని పంట పొలాలతో సుభిక్షంగా ఉండాలని, వరుణుడు కరుణించి చెరువులు, కుంటలు, వంకలు, వాగులు, పొంగి పొర్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబం

# వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాల్సిందే

**ప్రజాశక్తి-పామిడి**

ముస్లిం మైనారిటీల హక్కులను కాలరాసే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాల్సిందేనని ముస్లిములు నాయకులు హెచ్చరించారు. బిల్లును వ్యతిరేస్తూ ఖిల్లా మజీద్ ముత్తువల్లి బికే.రహీం, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రహీం అధ్యక్షతన శుక్రవారం మండల కేంద్రంలోని బొడ్రాయి నుంచి కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న ఈద్గా మజీద్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ముస్లిముల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును తీసుకొచ్చిందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కు, జాతి, మతం, కులం, లింగ బేధాలు లేకుండా చూడాల్సిన ప్రభుత్వాలే మైనారిటీలు, వారి ఆస్తులను లక్ష్యంగా చేసుకుని సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేందుకు యత్నించడం బాధాకరమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశ, అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. వక్ఫ్ బోర్డు బిల్లులో ఉపసంహరించకపోతే పెద్దఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిములు ఖిల్లా మజీద్ జమాత్, ఈద్గా మజీద్ జమాత్, దర్గా మజీద్ జమాత్, మదీనా మజీద్, మక్కా మజీద్ జమాత్, నక్షా మజీద్ జమాత్ మరియు యాడికి షేక్షావలి, దాదా ఖలందర్, రజాక్,బేల్దారి హల్లా, షేక్షావలి, జాకీర్ హుస్సేన్, పెద్దసంఖ్యలో ముస్లిములు పాల్గొన్నారు.

# మార్పులకు అనుగుణంగా అడుగులు వేయాలి

## ఎస్కెయు రిజిస్ట్రార్ రమేష్‌బాబు

**ప్రజాశక్తి-అనంతపురం**

డిజిటల్ యుగంలో మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఎస్కెయు రిజిస్ట్రార్ ఇ.రమేష్‌బాబు సూచించారు. శుక్రవారం ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ జాతీయ సదస్సు నిర్వహించారు. ముందుగా కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి ప్రస్తుత వ్యాపార రంగంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కీనోట్ స్పీకర్ ప్రొఫెసర్ బి.రాజశేఖర్, కేంద్రీయ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్‌టి రంగనాథం, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.జయప్రద, బి.షర్మిల రామయ్య, సి.విశ్వతేజ, టి.నాగలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఎఒ శ్రీనాథ్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వి కళాశాల వైస్‌చైర్మన్ సి.చక్రధరరెడ్డి

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**అనంతపురం రూరల్ :** పలువురు బాధితులకు మంజూరైన సిఎం రిలీఫ్ చెక్కులను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని కట్టకిందపల్లి గ్రామానికి చెందిన డి.నల్లమ్మకు రూ.35 వేలు, కందుకూరుకు చెందిన కమ్మర బ్రహ్మయ్యకు రూ.20వేలు, నరసనాయుని కుంటకు చెందిన గుత్తా వెంకటనారాయణకు రూ.25.74వేలు, సిండికేట్ నగర్‌కి చెందిన చాపట్ల చిన్న నారప్పకు రూ.20 వేలు, ఇటుకలపల్లికి చెందిన బుర్రా విజయ్‌భాస్కర్‌కు రూ.45వేలు, ఆకుతోటపల్లికి చెందిన చాకలి రాముడుకు రూ.65వేలు, షేక్ మస్తాన్‌వలికి రూ.74,236, చాకలి చెన్నమ్మకు రూ.10వేలు, ఎన్ఆర్ కాలనీకి చెందిన బి.అలివేలమ్మకు రూ.45వేలు, విద్యారణ్యనగర్‌కి చెందిన బోగే చిన్న పక్కీర్‌రెడ్డికి రూ.62,038, భాగ్యనగర్‌కు చెందిన చీర్ల నవ్యకు రూ.40,350 మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# మాజీ సైనికుల కార్యవర్గ సమావేశం

**అనంతపురం :** మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ దూదేకుల షేకన్న అధ్వర్యంలో శుక్రవారం నగరంలోని హెచ్ఎల్‌సి కాలనీలో ఉన్న కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహినంచారు. ఇందులో భాగగా కూడేరు మండలం గొటుకూరు సమీపంలో ఉన్న సైనికపురంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా సైనికపురంలో మిగిలిపోయిన విద్యుత్ లైన్లను పూర్తి చేయడానికి కార్యాచరణ రూపొందించారు. అలాగే మొక్కలకు నీరందించేందుకు కూడేరు ఎపిఓతో చర్చించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు వీకే రంగారెడ్డి, ట్రెజరర్ టి.తిమ్మారెడ్డి, కార్యవర్గ సభ్యులు ఇ.నాగిరెడ్డి, ఇ.రంగారెడ్డి, మాస్టర్ వారెంట్ ఆఫీసర్ బషీర్‌అహ్మద్, హెచ్.హుస్సేన్‌బాషా, గొల్ల ఈశ్వరయ్య, ఆర్ఎస్ నాగరాజు, బిఎ హుస్సేన్, బి.రవికుమార్, వై.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ వ్యాఖ్యలు వక్రీకరణ

**ఉరవకొండ :** రాష్ట్రంలో చట్టానికి బదులుగా టిడిపికి తొత్తులుగా మారి, చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కొద్దిమంది పోలీసులను ఉద్దేశించి వైసిపి అధినేత జగన్ మాట్లాడితే దీన్ని వక్రీకరించి పోలీసులందరికీ ఆపాదించడం బాధాకరమని శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. జగన్ సిఎంగా ఉన్నప్పుడు పోలీస్ వ్యవస్థ గౌరవాన్ని కాపాడేలా పని చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీస్ వ్యవస్థనే నీరుగార్చారన్నారు. ఇటీవల కాలంలో స్థానిక సంస్థల ఉప ఎన్నికల సందర్భంగా పోలీసుల తీరే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా జిల్లాలోని రామగిరిలో ఎస్ఐకి జగన్‌కు విమర్శించే స్థాయి లేదన్నారు. ఇకపోతే వైఎస్ భారతిపై ఐటిడిపి కార్యకర్త చేబ్రోలు కిరణ్ వ్యాఖ్యలు అత్యంత దారుణమన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని రానున్న కాలంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# ఎపిఒకు సన్మానం

**యాడికి :** ఉపాధి హామీ పథకం ఎపిఒగా బాధ్యతలు చేపట్టిన మద్దిలేటిని టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహ చౌదరి, నీలకంఠారెడ్డి, చాంద్‌బాషా, చందు, ఫిరోజ్, వెంకటేష్, బాలు పాల్గొన్నారు.

### అకాల వర్షాలకు

# నేలకొరిగిన పంటలు

**ప్రజాశక్తి-బెలుగుప్ప**

మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా బెలుగుప్ప చెందిన రైతు ఆంజనేయులు మొక్కజొన్న, రమనేపల్లికి చెందిన రైతు నారాయణస్వామి, గంగవరం నర్సాపురం చెందిన రవీంద్ర, మల్లికార్జున, తదితర రైతులు సాగుచేసిన అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. మండల వ్యాప్తంగా 575 ఎకరాల్లో పంటలు నాశనమయ్యాయి. అధికారులు స్పందించి నేలకొరిగిన పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

**రైతులను ఆదుకోవాలి**

అకాల వర్షం వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 10వతేదీన రాత్రి కురిసిన వర్షానికి బెళుగుప్ప, బొమ్మనహాల్, కణేకల్లు మండలాల్లో సాగుచేసిన వరి, అరటి, మొక్కజొన్న, తదితర పంటలు నాశనం అయ్యాయన్నారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి నివేదికలను తయారు చేసి రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు.

**కళ్యాణదుర్గం రూరల్ :** కళ్యాణదుర్గం మండలంలోని తిమ్మసముద్రం గ్రామ పంచాయితీ బాల వెంకటాపురం గ్రామ రైతు అంతేష్‌కు చెందిన బొప్పాయి చెట్లు గురువారం సాయంత్రం గాలీవానకు నేలకూలాయి. దాదాపు 4000 మొక్కలు నేలవాలాయి. దెబ్బతిన్న పంటను ఆర్డీవో వసంత బాబు, తహశీల్దార్ భాస్కర్ పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేశారు.

**రాయదుర్గం రూరల్ :** మండల పరిధిలోని జుంజురంపల్లి, నాగిరెడ్డిపల్లి, వేపరాల, ఆవులదట్ల, డి.కొండాపురం, టి.వీరాపురం, బిఎన్.హళ్లి గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులు, వర్షానికి మొక్కజొన్న పంట దెబ్బతినింది. నేల వాలిన మొక్కజొన్న పంటను మండల వ్యవసాయ అధికారి మహేంద్ర పరిశీలించారు. మండలంలో సుమారు 220 మంది రైతుల పొలాలలో 207 హెక్టార్ల విస్తీర్ణంలో సాగుచేసిన పంట నేలకొరిగిందని వ్యవసాయ అధికారులు తెలిపారు. దాదాపు రూ.26 లక్షల విలువైన పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశారు. ప్రతిపాదను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు నష్టపోయిన రైతుల జాబితాను తయారు చేస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులు పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలు రైతు సేవ కేంద్రం సిబ్బందికి అందించాలన్నారు.


రాయదుర్గం మండలంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

# కొనసాగిన సామాజిక చైతన్య యాత్ర

**ప్రజాశక్తి-పుట్లూరు**

ఎస్ఎఫ్ఐ, ఐద్వా, కెవిపిఎస్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక చైతన్య యాత్ర శుక్రవారం మండల పరిధిలోని కడవకల్లు గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా కెపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ స్వాతంత్రయం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా సమాజంలో అత్యధిక మంది పేదల బతుకులు మారడం లేదన్నారు. వెనుకబడిన తరగతుల్లో అత్యధిక మందికి ఈనాటికీ సొంతిల్లు లేకపోవడం బాధాకరమన్నారు. పాలకులు ఎంతో ఆర్భాటాలతో స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర అంటూ కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమయ్యారని విమర్శించారు. ఇప్పటికీ తాగడానికి మంచినీరు, రోడ్లు, మురికి కాలువలు, మరుగుదొడ్లు, వీధిలైట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, స్మశాన స్థలాలు లేవన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, అత్యాచారాలు, వేధింపులు కొనసాగుతున్నా ప్రభుత్వాలు నిద్రావస్థలో ఉన్నాయన్నారు. ఆయా సమస్యలపై ప్రజలను చైతన్యవంతులను చేసి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెపిఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పుట్లూరు సూరి, ఐద్వా జిల్లా నాయకులు శ్యామల, చంద్రిక, రామాంజనమ్మ, అశ్విని, కెవిపిఎస్ జిల్లా నాయకులు జీవరత్నం, రాజా, ఆక్కులప్ప నాగేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిద్ధు, తరిమెల గిరి, భీమేష్, సాయి, విజయ్, చౌదరి, నాగభూషణ్, పేదయ భాస్కర్‌రెడ్డి, పెద్దయ్య, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.


పుట్లూరు మండలం కడవకల్లులో మాట్లాడుతున్న వక్తలు

**నార్పల :** ఎస్ఎఫ్ఐ, ఐద్వా, కెవిపిఎస్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక చైతన్య యాత్ర శుక్రవారం మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా సమాజంలో అత్యధిక మంది పేదల బతుకులు మారడం లేదన్నారు. పూలే, అంబేద్కర్ కలలు కన్న సామాజిక న్యాయం అందడం లేదన్నారు. ఇలాంటి అనేక సమస్యలతో దళిత గిరిజన సామాజిక తరగతుల బాధలను తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకే యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు శ్యామల, చంద్రిక, రామాంజనమ్మ, అశ్విని, కె యు పీ ఎస్ జిల్లా నాయకులు జీవరత్నం, రాజా, ఆక్కులప్ప నాగేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిద్దు, తరిమెల గిరి, భీమేష్, సాయి, విజయ్, చౌదరి, నాగభూషణ్, పేదయ భాస్కర్ రెడ్డి, పెద్దయ్య, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ పోరాటానికి సన్నద్ధం కండి

## ఎఐకెస్ ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

రైతాంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో పోరాటాలకు సన్నద్ధం కావాలని సీనియర్ నాయకులు వై.కేశవరావు పిలుపునిచ్చారు. శుక్రవారం రైతు సంఘం ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో జెండా ఆవిష్కరించారు. అలాగే కూడేరు మండలంలో కూడా రైతుసంఘం నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు వెంకటమ్మ, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు, రైతుసంఘ మండల కార్యదర్శి రాము, అవాజ్ మండల కార్యదర్శి వలి, సరోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**బుక్కరాయసముద్రం :** రైతుసంఘం ఏర్పడి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంతోపాటు రెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం జెండాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, రైతుసంఘం మండల సెక్రటరీ డి.శ్రీనివాసులు, నాయకులు వి.శివారెడ్డి, హనుమంతు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.కుళ్లాయప్ప, నాయకులు సంజీవరెడ్డి, వేణు, నారాయణస్వామి, జయరామ్‌రెడ్డి, మనోహర, శ్రీరాములు, అంజి, వెంకట కొండ, తదితరులు పాల్గొన్నారు.

**ఉరవకొండ :** వజ్రకరూరు మండలం కేంద్రంలో ఎఐకెఎస్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరూపాక్షి, మండల అధ్యక్షులు ఓబుళపతి, రైతుసంఘం మండల కార్యదర్శి సుధాకర్, సిఐటియు రంగమ్మ, సుధాకర్, ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెంజిమెన్, జనవిజ్ఞాన వేదిక నాయకులు మల్లికార్జునస్వామి, హమాలీ నాయకులు చంద్రశేఖర్, ఆవుల బూసి, రైతుసంఘం నాయకులు వెంకటేష్, కదిరప్ప, మాబు, చిన్న ఆంజనేయులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో జెండాను ఎగురవేస్తున్న రైతుసంఘం నాయకులు

**గార్లదిన్నె :** అఖిలభారత కిసాన్ సభ 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో ఎపి రైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, నారాయణరెడ్డి, నాగార్జున, వలి, రవీంద్ర, ఆదినారాయణ, క్రిష్టయ్య, తాతయ్య, మహబూబ్, షరీఫ్, దామోదర్, నరసింహ, శేఖర్, జాఫర్, రైతులు పాల్గొన్నారు.

# నార్పల ఎంపిడిఒగా భాస్కర్



**నార్పల :** మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపిడిఒగా భాస్కర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న గంగావతి సెలవుపై వెళ్లడంతో శింగనమల ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి శైలజారాణి, కార్యాలయ పర్యవేక్షకురాలు ఉమాదేవి, సీనియర్ అసిస్టెంట్ నూర్ మొహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, వెంకటరమణ, శ్రీనివాసులు, చరణ్, పరుశురాం, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, వరలక్ష్మి, రాజేశ్వరి, కీర్తన, హర్ష, మల్లికార్జున, కుళ్లాయప్ప, గోపాల్‌రెడ్డి, మాధవి, చినరాయుడు, శిరీషా పాల్గొన్నారు.

# నార్పల ముతవల్లిగా ఇక్బాల్‌బాషా



**నార్పల :** నార్పల మండల ముతవల్లిగా ఇక్బాల్‌బాషాను ముస్లిం మత పెద్దలు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కూడా తాను మూతవల్లిగా పని చేశానని గుర్తు చేశారు. మరోసారి తనపై నమ్మకంతో ముతవల్లి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మసీదుల అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా సానే ముతవల్లిగా కార్పెంటర్ మసూద్, 10మంది పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన

**పుట్లూరు :** మండల పరిధిలోని కడవకల్లు గ్రామ సమీపంలో వెహికల్ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్, సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీల్ వాహనదారులు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని, ప్రతి ఒక్కరి వాహనానికీ బీమా కలిగి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్‌ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యల్లనూరు ఎస్ఐ రామాంజనేయరెడ్డి పుట్లూరు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం

**గుత్తి :** మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం నుంచి ఆరు రోజులు పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ జీవీ.నాగేంద్రబాబు, లైన్ ఇన్స్‌పెక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అబ్బేదొడ్డి, అనగానిదొడ్డి, పెద్దొడ్డి గ్రామాలకు 440 టవర్ లైన్లు లాగుతున్న కారణంగా విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

**యల్లనూరు :** మండల పరిధిలో ని వెన్నపూసపల్లి సబ్‌స్టేషన్‌లో 33/11కెవి విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఎఇ రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పాతపల్లి, వెన్నపూసపల్లి, గడ్డంవారిపల్లి, దుగ్గుపల్లి, కోడుమూర్తి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

# పట్టణాభివృద్ధికి సహకరించండి

**తాడిపత్రి :** ప్రభుత్వం అందిస్తున్న పన్ను రాయితీలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకుని మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ శివరామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తాడిపత్రి పురపాలక సంఘంలో బకాయి ఉన్న ఆస్తి, ఖాళీ స్థలాలు వంటి పన్నులను చెల్లించి 50 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెలాఖరు వరకూ వడ్డీపై రాయితీకి అవకాశం ఉందన్నారు. కావున ప్రజలు నెలాఖరులోపు పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# సైబర్ నేరగాళ్ల వలలో మహిళా రైతు

## రూ.99,460 కాజేత


సైబర్ నేరానికి గురైన నిర్మలమ్మ

**బెలుగుప్ప :** మండల కేంద్రానికి చెందిన మహిళా రైతు నిర్మలమ్మ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. ఈనేపథ్యంలో సైబర్ నేరగాళ్ల మోసంతో సుమారు రూ.99,460 బ్యాంకు అకౌంట్ ద్వారా మోసపోయిన విషయం శుక్రవారం వెలుగు చూసింది. రెండు రోజుల క్రితం కందులు విక్రయించగా బెలుగుప్ప బ్రాంచ్ ఎస్‌బిఐ అకౌంట్‌కు రూ.1.38లక్షలు జమ అయింది. దీంతో గురువారం ఉదయం బ్యాంకుకు వెళ్లి డ్రా చేసుకోవడానికి వెళ్లగా 0896742643 ఫోన్ నెంబర్ ద్వారా బ్యాంకు సంబంధించిన మెసేజ్ వచ్చింది. రూ.24,500 ఒకసారి, 24,960 రెండోసారి, రూ.50వేలు ఇంకోసారి డ్రా అయినట్టు వచ్చింది. కేవలం రూ.35,694 మాత్రమే అకౌంట్లో ఉన్నాయి. దీనిపై బాధిత మహిళా రైతు నిర్మలమ్మ బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు సూచనల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# కార్మికురాలి మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న నాగేంద్రకుమార్

**అనంతపురం కార్పొరేషన్ :** అనారోగ్యంతో మృతిచెందిన పారిశుధ్య కార్మికురాలు లక్ష్మీదేవికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ శుక్రవారం నివాళు లర్పించారు. ఇందులో భాగంగా నగరంలోని అంబేద్కర్‌లో ఉన్న మృతురాలి స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని 2వ సర్కిల్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన లక్ష్మీదేవికి నగరపాలక సంస్థ అధికారులు దహన సంస్కారాలకు రూ.25వేలు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. నివాళులర్పించిన వారిలో సిఐటియు పట్టణ కార్యదర్శులు, ముత్తుజ, వెంకటనారాయణ, గురాజ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏటీఎం నాగరాజు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు

# వేగవంతంగా అహుడా అభివృద్ధి : ఛైర్మన్ టిసి వరుణ్

**అనంతపురం కార్పొరేషన్ :** అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందేలా కృషి చేస్తానని ఛైర్మన్ టిసి వరుణ్ అన్నారు. శుక్రవారం స్థానిక అహుడా కార్యాలయంలో అహుడా 19వ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ల్యాండ్ బ్యాంకింగ్ కోసం 13 చోట్ల భూములను గుర్తించారు. అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ ఆదేశాల మేరకు వివిధ అంశాలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు. ఈ సందర్భంగా టిసి వరుణ్ మాట్లాడుతూ అహుడా అభివృద్ధి కోసం ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారుల సహాయ సహకారాలతో ముందుకెళ్లాలన్నారు. అందరూ సమిష్టిగా పని చేద్దామన్నారు. ఈ క్యాక్రమంలో అహుడా వైస్ ఛైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మ, కార్యదర్శి గౌరీశంకర్‌రావు, ఇఇ దుష్యంత్, ప్లానింగ్ ఆఫీసర్ మహమ్మద్‌ఇషాక్, ఆన్‌లైన్ దార్వా ఒఎస్‌డి వెంకటసుబ్బయ్య, అధికారులు పాల్గొన్నారు.

# రామలక్ష్మి నేత్రదానం

**అనంతపురం :** నగరంలోని ఎన్‌టిఆర్ మార్గ్ రాజహంస వద్ద ఉన్న స్టార్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఎం.రామలక్ష్మి (81) సాయిట్రస్టు ద్వారా నేత్రదానం చేశారు. రామలక్ష్మి అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో సాయిట్రస్టు వారు రామలక్ష్మి నేత్రాలను దానం చేయాలని అల్లుడు సరస్వతి విద్యామందిర్ కార్యదర్శి, వ్యాపారవేత్త భుశెట్టి రమణమూర్తితోపాటు కుటుంబ సభ్యులను ఒప్పించారు. దీంతో ఎల్‌వి ప్రసాద్ ఐ ఆసుపత్రికి చెందిన ఆప్తమాలిక్ అసిస్టెంట్ శ్రీకాంత్ నేత్రాలను సేకరించారు. నేత్రదానం చేయాలనుకునే వారు సెల్ 87123 45520, 96667 56921 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# మొక్కలు పంపిణీ

**యాడికి :** మండల కేంద్రంలో శుక్రవారం మండల కేంద్రంలోని రైతులకు మామిడి, అల్ల నేరేడు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తీసుకున్న మొక్కలను రైతులు తమ పొలాల్లో నాటుకుని సంరక్షించుకోవాలన్నారు. మొక్కలను పెంచుకుంటే కాలుష్య నివారణ తగ్గి వర్షాలు కురుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వోలు దామోదర్‌నాయుడు, భీమేశ్వర్‌రెడ్డి, రైతులు హరి, రఘు, ఐ టిడిపి అధ్యక్షుడు నరసింహచౌదరి, తెలుగు యువత నాయకుడు నీలకంఠారెడ్డి, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

**ఉరవకొండ :** సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి భత్తుల కోదండరామిరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని 5 సచివాలయాల్లోని సచివాలయ సిబ్బంది, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందితో కలిసి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగగా ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ.గౌస్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## కూలిన మట్టిదిబ్బ.. తప్పిన ప్రమాదం..

**కుందుర్పి :** మట్టి దిబ్బల వద్ద ఆడుకునేందుకు వెళ్లగా అవి కూలడంతో వలస కూలీల పిల్లలు స్పృహ తప్పి పడిపోయిన సంఘటన శుక్రవారం మండలంలోని మలయనూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. ఎస్ఐ నగేష్ తెలిపిన వివరాలు.. కొన్ని నెలల క్రితం మహారాష్ట్రకు చెందిన కొందరు కూలీలు మలయనూరు గ్రామానికి వలస వచ్చారు. వారు బొగ్గులు కాల్చి తద్వారా వచ్చిన ఆదాయంతో జీవనం సాగించేవారు. ఆ కూలీల పిల్లలు గ్రామ శివారులో ఉన్న చెరువులో మట్టిదిబ్బ వద్ద ఆట్లాడుతుండగా ఒక్కసారిగా మట్టి దిబ్బకూలడంతో నలుగురు పిల్లలు స్పృహ కోల్పోయారు. ఒక పిల్లవాడికి మూగ దెబ్బలు ఎక్కువ కావడంతో బెంగళూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ముగ్గురు పిల్లలు కర్నాటకలోని పరశాపురం సమీపంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని ఎస్ఐ తెలిపారు.

## రైలు నుంచి పడి మహిళకు గాయాలు

**గుత్తి :** గుత్తి రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం రాత్రి రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. పీలేరు నుంచి సికింద్రాబాద్ కి వెళ్తున్న పీలేరుకు చెందిన నాగరత్నమ్మ కంటి శస్త్ర చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ఆసుపత్రికి తన కుమార్తె తో కలిసి పీలేరు నుంచి సికింద్రాబాద్ కు వెళ్లే రైలు (12731)కి రిజర్వేషన్ భోగిలో బయలుదేరారు. గుత్తి రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే నాగరత్నమ్మ మరుగుదొడ్డికి వెళ్లింది. ఆమె నిద్రమత్తులో ఉండటంతో మరుగుదొడ్డి తలుపు తీయడానికి వెళ్లి ట్రైన్ తలుపు తీయడంతో ప్రమాదవశాత్తు కాలుజారి రైలు నుంచి జారిపడడంతో తలభాగం, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అర్ధ రాత్రి నుంచి ఉదయం వరకు పట్టాల పక్కనే ఉండిపోయింది. ఉదయం 6 గంటల సమయంలో రైల్వే కీ మెన్‌గా పనిచేస్తున్న సి.రామాంజనేయులు విధుల్లో భాగంగా రైలు పట్టాలను పరిశీలిస్తు ట్రాక్ వెంట వెళ్తున్న సమయంలో గాయాలతో పడి ఉన్న ఆమెను గుర్తించి చేరదీశాడు. ఆమె బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అలాగే 108 వాహనానికి సమాచారం అందించి గుత్తి ప్రభుత్వాసుపత్రికి ఆమెను తరలించి ధాతృత్వాన్ని చాటుకున్నాడు.

## నిందితులు అరెస్టు

**నార్పల :** ఇటీవల కాలంలో నార్పల లో జరిగిన చాకలి సుధాకర్, రాజన్న ఇళ్లలో చోరీ చేసిన ముగ్గురు నిందితులను నార్పల క్రాసింగ్ సమీపంలో శుక్రవారం అరెస్టు చేసినట్లు సిఐ కౌలుట్లయ్య తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సాగర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నార్పలకు చెందిన మట్లగొంది శ్రీకాంత్, మట్లగొంది ప్రవీణ్, అబ్బ దాసరి ధనరాజ్‌ను అదుపులోకి తీసుకుని ఐదు జతల బంగారు కమ్మలు, రెండు బంగారు తాళిబొట్టు బిల్లలు, ఒక బంగారు లక్ష్మీకాసు, ఒక బంగారు తాళిబొట్టు, మూడు జతలు వెండి గొలుసులు, రెండు జతల బంగారు కమ్మలతోపాటు నిందితులు ఉపయోగించిన హోండా షైన్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**రాయదుర్గం :** రెండు రోజులుగా గాలివాన బీభత్సానికి బొమ్మనహాల్, కణేకల్లు, డి.హీరేహాల్ మండలాల్లో దెబ్బతిన్న ఉద్యాన, వరి పంటల రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలను వెంటనే ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. అకాల వర్షానికి నియోజకవర్గంలో ఎక్కువ నష్టం జరిగిందనారు. కావున కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం చేయాలని కోరారు. పరిహారం అందించకపోతే రైతుల పక్షాన పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

**రైతులకు న్యాయం జరిగేంత వరకూ పోరాడతాం.. : గౌని ప్రతాపరెడ్డి**

నియోజకవర్గ వ్యాప్తంగా ఈదురుగాలులు, వడగళ్ల వానకు చేతికొచ్చిన పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాయదుర్గం రైతు రక్షణ వేదిక అధ్యక్షులు, నియోజకవర్గ బిసివై పార్టీ అధ్యక్షులు గౌని ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. రూ. లక్షల్లో పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చిన సమయంలో అకాల వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతినడంతో రైతులు తీవ్ర నిరాశలో మునిగిపోయారన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తక్షణమే వెళ్లి పంట నష్టపరిహారం చెల్లిస్తామని రైతులకు భరోసా ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే నష్టపరిహారం అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకోమన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం జరిగేంత వరకూ బిసివై పార్టీ అండగా ఉంటుందన్నారు.

**బొమ్మనహాల్ :** అకాల వర్షాలకు మండలంలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు మండల కన్వీనర్ ఓబులేసు, కమిటీ మెంబర్ వన్నూరుస్వామి, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వరి పంట సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ. 30వేలు, మొక్కజొన్నకు రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రుణాలు మాఫీ చేసి, మరో పంట సాగు చేయడానికి ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని కోరారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించండి

**నార్పల :** పదో తరగతి పాసైన విద్యార్థులను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చేర్పించాలని నార్పల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలప్ప కోరారు. ఈమేరకు కళాశాల అధ్యాపకులు సిబ్బందితో కలిసి మండలంలోని గూగూడు, పప్పూరు, కేసేపల్లి గ్రామాల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల తల్లిదండ్రులను శుక్రవారం కలిసి వివరించారు. కళాశాలలో ఎంబైపిసి, ఎంపీసీ, బైపీసీ సీఈసీ వంటి గ్రూపులు ఉన్నాయని, కావున ప్రభుత్వ కళాశాలలోనే మీ పిల్లలను చేర్పించాలని కోరారు.

## రేషన్‌కార్డుదారులకు ఇకెవైసి తప్పనిసరి

**గుత్తి :** మండలంలోని కార్డుదారులందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని తహశీల్దార్ డి.ఓబిలేసు, సిఎస్‌డిటి కె.సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లు పైబడిన పిల్లల నుంచి 80ఏళ్ల వృద్ధుల వరకూ ఈనెల 30వతేదీలోపు రేషన్ దుకాణాల వద్ద ఇకెవైసి చేసుకోవాలన్నారు.

## పిల్లల సంరక్షణపై శ్రద్ధ ఉంచాలి

**గుత్తి :** గర్భం దాల్చినప్పటి నుంచి రెండు సంవత్సరాలు వచ్చే వరకు చిన్నారుల సంరక్షణపై తల్లులు శ్రద్ధ వహించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.నాగేశ్వరి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని భీమ్ రావు కాలనీ, గాజులభావి వీధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పోషన్ పక్వడా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

# సాంఘిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే

## జిల్లా వ్యాప్తంగా జయంతి కార్యక్రమాలు



జెఎన్‌టియులో నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

**ప్రజాశక్తి-అనంతపురం**

గొప్ప సాంఘిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.క్రిష్ణయ్య అన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సమానత్వం, గ్రామీణ ప్రాంతాల మహిళల విద్యాభివృద్ధికి పోరాడిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు. ఆయన ఆశయాలు సాధించడం దేశపౌరుల కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి విసి ఎన్.దేవన్న, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, పిఆర్ భానుమూర్తి, ఎస్‌వి సత్యనారాయణ, జి.ప్రశాంతి, నాగప్రసాద్‌నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, బి.దుర్గాప్రసాద్, జివి సుబ్బారెడ్డి, సుజాత, వైశాలి ఘోర్పడే, కిరణ్మయి, పద్మ సువర్ణ, సి.శోభాబిందు, విబి చిత్ర, శివకుమార్, ఎం.అంకారావు, శ్రీధర్, ఫైనాన్స్ ఆఫీసర్ శిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం క్రైం :** పూలే జయంతి పురస్కరించుకుని శుక్రవారం ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఇలియాజ్‌బాషా, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయ ఎఒ రవిరామ్‌నాయక్, సిఐ హరినాథ్, ఆర్‌ఐలు పవన్‌కుమార్, బాబు, రాముడు, ఆర్‌ఎస్‌ఐ బాబ్జాన్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, ఎఆర్ పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**గుంతకల్లు :** అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు కొనియాడారు. శుక్రవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 180 ఏళ్ల క్రితం దేశంలో ఉన్న కులవివక్ష, అంటరానితనం, అసమానతలపై అనేక ఉద్యమాలు నిర్మించిన మహా నాయకుడు మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్రబాబు, సంచార జాతుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, పట్టణ కమిటీ సభ్యులు రామునాయక్, సూరి, చొక్కా సునీల్, మల్లికార్జున, వెంకీ, ఆటో, కారు డ్రైవర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం రూరల్ :** మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ గాంధీజీ కంటే ముందుగా మహాత్మ బిరుదుతో జననీరాజనాలు అందుకున్న గొప్ప వ్యక్తి జ్యోతిబాపూలే అన్నారు. సమాజంలో స్త్రీలు సగభాగం అని, వారివల్లే సమాజాభివృద్ధి అని భావించిన గొప్ప మహోన్నత వ్యక్తి అన్నారు. అలాంటి ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్, మేయర్ వసీం, తదితరులు పాల్గొన్నారు.

అలాగే అనంతపురం క్యాంపు కార్యాలయంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమాజానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**పామిడి :** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వివిధ రాజకీయ పార్టీ నాయకుల, ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, బీఎస్పీ జిల్లా కార్యదర్శి వెంకటయ్య, భారతీయ భీమ్ సేన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జైభీమ్ రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షులు పామిడి సాకే ఓబులేసు, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ఓబులేసు యాదవ్, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సభ్యులు మడకశిర సోమన్న, జెన్నె చిన్న దుర్గప్ప, జనసేన పార్టీ మండల సీనియర్ నాయకులు కొట్టాల సూర్యనారాయణ, కొండాపురం రవి, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపప్పూరు :** మండల కేంద్రంలోని ఆర్డీటీ కాలనీలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, ఎంఆర్‌పిఎస్ నాయకులు వీరన్న, సాయి, పి.రామకృష్ణ, నారాయణస్వామి, కృపానంద, తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం :** ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన మేరకు అర్బన్ టిడిపి కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోనంకి గంగారామ్, రాయల్ మురళి, ముక్తియార్, కూచి హరి, సరిపూటి రమణ, సుధాకర్‌యాదవ్, గోపాల్‌గౌడ్, బాలాంజనేయులు, సాకే లక్ష్మీనరసింహ, ఫిరోజ్ అహ్మద్, వెంకటప్ప, కృష్ణకుమార్, జెఎం బాషా, దగ్గుపాటి రాజా, నెట్టెం బాలకృష్ణ, జోగి రాజేంద్ర, కాయగూరల శ్రీధర్ రాయల్, నారాయణస్వామి యాదవ్, మణికంఠ బాబు, వేలూరు మారుతీనాయుడు, ఓంకార్‌రెడ్డి, తాటి మధు, కృష్ణం రఘు, కదిరప్ప, వడ్డే వెంకటేష్, సిరిశాల రాంబాబు, బళ్లారి గోపాల్, నారాయణస్వామి, మాజీ ఎంపిపి ఇస్మాయిల్, వడ్డే హరి, తదితరులు పాల్గొన్నారు.

**ఉరవకొండ :** స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్, వార్డు మెంబర్ నిరంజన్ గౌడ్, అమర్నాథ్, బిసి నాయకులు లెనిన్‌బాబు, ముండాస్ ఓబులేసు, కార్యాలయ సిబ్బంది సాయిప్రసాద్, నాగరాజు, రాజయ్య, అబూబాకర్, ప్రతాప్, అబ్దుల్, వన్నూర్‌సాబ్, శర్మస్‌వలి, గోపాల్, నాగరాజు, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం :** జిల్లా పరిషత్ ప్రాంగణంలో బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ దగ్గర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా చంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు ఎం.మోతిలాల్, నాయకులు శివ రుద్రప్ప, చంద్రమున్నయ్య, శ్రీనివాసులు, ఎస్‌ఎస్‌బిఎన్ డిగ్రీ కాలేజ్ లెక్చరర్ నగరూర్ రసూల్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవుల చక్రధరయాదవ్, కడియాల రామాంజనేయులు, బెస్త సంఘం రాష్ట్ర నాయకులు కుళ్లాయప్ప, బీసీ ఉద్యోగాలు సంఘం సీనియర్ నాయకుడు వెంకటస్వామి, ఎంపిడిఒ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

**బుక్కరాయసముద్రం :** మండల కేంద్రంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివనాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భాస్కర్, ఎంపిడిఒ సొలమన్‌రాజ్, పిఆర్ జె మద్దిలేటి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ నాగేంద్ర, నాయకులు బుల్లే నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి :** గుత్తి ఆర్‌ఎస్‌లో ఉన్న పూలే విగ్రహానికి జెవివి జిల్లా అధ్యక్షుడు పి.వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షుడు ఎ.రామాంజనేయులు, సి.విజయభాస్కర్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, పట్టణ అధ్యక్షులు కె.మధుసూదన్ రెడ్డి, నాయకులు డి.హుస్సేన్ పీరా, జి.గోవర్ధన్ రెడ్డి,ఎం. రంగస్వామి,బి.రమేష్ రెడ్డి, గురు ప్రసాద్ యాదవ్,కెఎం.రంగనాయకులు, కౌన్సిలర్ వరద, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పెన్షనర్ల భవనంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్,అదనపు కార్యదర్శి జెన్నె కుల్లాయిబాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

**అనంతపురం :** జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న విగ్రహానికి ఆర్ఇఎఫ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణనాయక్, నాయకులు మావిటి శ్రీరాములు, డి.మర్రిస్వామి, బి.రాజశేఖర్, పామన్నయాదవ్, బి.నారాయణప్ప, దస్తగిరి, వరప్రసాద్, కె.నారాయణస్వామి, ఈశ్వరయ్య, టి.రాజారమేష్, వై.పుల్లయ్య, పల్లె జయరామ్, ఆర్.మల్లికార్జున, బి.గోపాల్‌నాయక్, ఎ.నాగభూషణం, టి.ఆదినారాయణ, జి.రామాంజనేయులు, వి.రామకృష్ణ, జిల్లాకు కన్వీనర్లు ఎన్.రాఘవేంద్రరావు, శ్రీనివాసులు, రవి, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం కలెక్టరేట్ :** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య అన్నారు. శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్‌లోని పూలే విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు బికే.నారాయణ, పద్మావతి, శివ, రుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

**కళ్యాణదుర్గం రూరల్ :** మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దామని టిడిపి నాయకులు తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కార్యాలయం ప్రజావేదిక వద్ద శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పూలే సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు చౌలం మల్లికార్జున, కర్లకుంట రామాంజనేయులు, దేవినేని అవినాష్, మార్కెట్ యార్డు ఛైర్మన్ గోళ్ల లక్ష్మీదేవి, వైస్ ఛైర్మన్ కోనంకి రాజశేఖర్, ఎంపిటిసి ఓబయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు శర్మాస్, శివన్న, ధనుంజయ, కొల్లాపురప్ప, నాగరాజు, డిష్ మురళి, షామీర్, రమేష్, గోపాల్, శోభ, అరుణ, లాల్‌కృష్ణ, తలారి సత్తి, రాము, భార్గవ్, అన్వర్, నాగన్న, మాబు, హరి, మంజు, విరుపాక్షి, సాయినాథ్, సునీల్, బసవరాజు, తిమ్మరాయుడు పాల్గొన్నారు.

**రాయదుర్గం రూరల్ :** పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మహాత్మజ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పూలే అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళా సాధికారతకు కృషి చేసిన మహనీయుడు అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, బాలనరసింహులు, బాబు, దేవదాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, కోదండరాములు, దొడ్డ నాగప్ప, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



పూలేకు నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ